


Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 13 | గురువారం 20 ఆగస్టు 2026 | పేజీలు : 8 వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## అయోధ్యలో భూముల దందా



- రాజకీయ నేతల బంధువులకు భారీ లాభాలు
- తక్కువ ధరకు కొనుగోలు.. కొన్నేండ్లకే అధిక ధరకు ట్రస్టుకు విక్రయం
- బీజేపీ మాజీ మేయర్ బంధువులు, ఏబీవీపీ నేత, ఇతర నాయకుల కుటుంబాల పేర్లు వెలుగులోకి

**అయోధ్య – సూర్య వాస్తవం**

యూపీలోని అయోధ్యలో రామమందిరం చుట్టూ భక్తి, విశ్వాసం పేరుతో సాగిన నిర్మాణాల వెనుక భూముల లావాదేవీల్లో భారీ లాభాల ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. అయోధ్యలోని బాగ్ బిజైసీ గ్రామంలో భూముల రికార్డులను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, వారి బంధువులు, రాజకీయ అనుబంధ వ్యక్తులు తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి.. కొంతకాలం తర్వాత రామమందిర ట్రస్టుకు అధిక ధరలకు

- మిగతా 2లో..



## యూజీసీ- నెట్ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తాం

### - ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

యూజీసీ- నెట్ 2026 పరీక్ష?ను తిరిగి సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం బుధవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ప్రశ్నాపత్రాల్లో కొన్ని లోపాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, యూజీసీ- నెట్ జూన్ 2026 పరీక్ష?కు సంబంధించి సోషల్‌తో సహా మూడు సబ్జెక్టులకు పున:పరీక్ష? నిర్వహిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. ప్రశ్నాపత్రం లీకైందన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ, పరీక్ష?ను తిరిగి నిర్వహించే వరకు ఫలితాల విడుదలను నిలిపివేయాలని కోరుతూ జూన్ 30న సోషియాలజీలో పరీక్ష? రాసిన ఒక అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జస్మీత్ సింగ్ విచారణ చేపట్టారు. ఇంగ్లిష్, కామర్స్ పేపర్‌లను సెప్టెంబర్ 9న, సోషియాలజీ పేపర్‌ను సెప్టెంబర్ 10న నిర్వహిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. సొలిసిటర్ జనరల్ చేసిన ప్రకటన దృష్ట్యా, పిటిషన్‌లోని అభ్యర్థనకు ఇక ఆస్కారం లేదని,

- మిగతా 2లో..

# పరిస్థితి మరింత దిగజారింది

- మోడీ ప్రభుత్వాన్ని ఇంకా నమ్మొచ్చా?
- ఆగ్రహంతో దేశ యువత
- అయోధ్య విరాళాల చోరీపై ప్రధాని సమాధానం చెప్పాలి
- సరిహద్దుల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రజలకు పారదర్శకత అవసరం
- సీడబ్ల్యూసీ భేటీలో మల్లికార్జున ఖర్గే ఎన్నికలు జరిగే ఏడు రాష్ట్రాల గురించి చర్చ



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

"విద్య, రామాలయ విరాళాలు చోరీ, జాతీయ భద్రత వంటి విషయాలలో మోడీ ప్రభుత్వాన్ని ఇంకా విశ్వసించవచ్చా?" అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. బుధవారం నాడిక్కడ ఇందిరా భవన్‌లో మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. మరోవైపు వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా అనుసరించాల్సిన వ్యూహంపై సమీక్షించారు. ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన అంశాలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ... ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్,

- మిగతా 2లో..



## ఆరోగ్య బీమా పరిమితి 25 లక్షలకు పెంపు

- పాల ధర లీటర్ రూ.38 నుంచి రూ.41కి పెంపు
- పాడి రైతులకు ఊరట
- ఎమ్మెల్యేలకు ప్రత్యేక భత్యం, కారు సౌకర్యం
- ఇంధన ఖర్చులు, డ్రైవర్ వేతనం కోసం నెలకు 75,000
- తమిళనాడు ప్రజలకు సీఎం జోసెఫ్ విజయ్ వరాల జల్లు

**చెన్నై– సూర్య వాస్తవం**

తమిళనాడు ప్రజలపై సీఎం విజయ్ వరాల జల్లు కురిపించారు. 'ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం' వార్షిక పరిమితిని రూ. 5 లక్షల నుంచి ఏకంగా రూ. 25 లక్షలకు ఐదురెట్లు పెంచుతున్నట్లు ప్రకటించారు. పాల ధరలను పెంచుతూ పాడి రైతులకు ఊరట కల్పించగా, నియోజక వర్గాల్లోని సమస్యలను తెలు సుకునేందుకు ఎమ్మెల్యేలకు ప్రత్యేక వాహనం, ఇతర ఖర్చులను అందిస్తామని చెప్పారు. బుధవారం వర్షాకాల అసెంబ్లీ

- మిగతా 2లో..



## ఎన్నికలకు సిద్ధంకండి..

- గెలుపే లక్ష్యంగా పని చేయండి
- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఉద్యోగుల హక్కుల కోసం...

# ఉద్యమ శంఖారావం...!

- 28న విజయవాడలో రాష్ట్ర సదస్సు.. అదే రోజు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం ..!
- ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం కాలయాపన వద్దు...
- చర్చల పేరుతో జాప్యం చేస్తే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకూ పరిష్కారం చూపాలి.
- ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ దివాకర్ రావు...!




**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి నాయకులు దీవాకర్ రావు తెలిపారు. ఈ నెల 28న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, అదే రోజు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. అనంతపురం టౌన్‌లోని కృష్ణ కళామందిర్, రెవెన్యూ భవన్‌లో బుధవారం ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వ వైఖరిపై ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా చైర్మన్ ఆర్.ఎన్. దివాకరరావు, సెక్రటరీ జనరల్ పి.ఎస్. ఖాన్, అసోసియేట్ చైర్మన్ బి. మల్లా రాయుడు, కోశాధికారి బి. సంతోష్ గౌడ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సురేఖరావు, జనరల్ సెక్రటరీ ఎం.నాగవేణి తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ సన్నద్ధత సభలు ప్రారంభించిన సమయంలో ప్రభుత్వం చర్చలకు పిలవడం సానుకూల పరిణామంగా భావించామని తెలిపారు. అయితే జూలై 22న మంత్రివర్గ ఉపసంఘం ఉద్యోగ సంఘాలతో సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క నిర్ణయాన్ని కూడా ప్రకటించకపోవడం ఉద్యోగుల్లో అసంతృప్తికి కారణ మైందన్నారు. ఉద్యోగులు కొత్త డిమాండ్లు కోరడం లేదని, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే నిర్ణయాలు

- మిగతా 2లో..

## గ్రూప్--1 నియామకాల్లో చరిత్రలో చూడని అక్రమాలు...!

- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అభ్యర్థుల జవాబు పత్రాలు...
- 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో జవాబు పత్రాలు...
- బాధ్యులు సభకు వచ్చి సమాధానం చెప్పాలన్న సీఎం చంద్రబాబు...!
- భవిష్యత్తులో అక్రమాలకు తావులేకుండా ఏపీపీఎస్సీ ప్రక్షాళన...

శాసనసభలో సీఎం చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు...!



**అమరావతి – సూర్య వాస్తవం :**

అమరావతి గ్రూప్--1 నియామకాల్లో గత ప్రభుత్వ హయాంలో భారీగా అవకతవకలు జరిగాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభలో ఆరోపించారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో నిబంధనలను ఉల్లం ఘించారని, అర్హత లేని సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో ఉపయోగించారని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో అభ్యర్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించారని సీఎం ఆరోపించారు. అంతేకాకుండా అభ్యర్థుల జవాబు పత్రాలు

- మిగతా 2లో..

# గ్రూప్--1 నియామకాల్లో చరిత్రలో చూడని అక్రమాలు...!

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని అన్నారు. 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో పేపర్లు ఉంచి నిబంధనలను పట్టించుకోలేదని విమర్శించారు. అప్పటి ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై బాధ్యత వహించాల్సిన వ్యక్తి ప్రస్తుతం శాసనసభకు వచ్చి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా లేరని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)ను ప్రక్షాళన చేస్తామని సీఎం చంద్రబాబు శాసనసభలో వెల్లడించారు.

# యూజీసీ- నెట్ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

దీంతో పిటిషన్ పరిష్కరించబడిందని జస్టిస్ జస్మీత్ సింగ్ పేర్కొన్నారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్- స్కాలర్‌షిప్), అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ 22 నుంచి 30 వరకు 87 సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ జూన్ 2026 పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే.

# ఆరోగ్య బీమా పరిమితి 25 లక్షలకు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల్లో సీఎం విజయ్ తమిళనాడు ప్రజలకు లబ్ధి చేకూరే నిర్ణయాలను వెల్లడించారు. 110వ నిబంధన ప్రకారం ప్రజారోగ్యం అనేది ప్రయోజనం కాదని, ప్రతీ ఒక్కరి ప్రాథమిక హక్కు అని వ్యాఖ్యానించారు. ఆదాయంతో ప్రమేయం లేకుండా ప్రతీ ఒక్కరికీ మెరుగైన వైద్యాన్ని అందించ డానికే ఈ చారిత్రాత్మక పెంపు చేపట్టామని స్పష్టం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ 'ఆవిన్ పాల' సేకరణ ధరను లీటరుకు రూ. 38 నుంచి రూ. 41కి పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినప్పటికీ, రాష్ట్రంలోని 3.16 లక్షల మందికి పైగా ఉన్న పాల ఉత్పత్తిదారులకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని తో పాటు వైద్య రంగ విస్తరణలో భాగంగా రాష్ట్రంలో వైద్య విద్యార్థుల సీట్ల సంఖ్యను కూడా పెంచనున్నట్లు తెలిపారు. శాసనసభ్యుల పనితీరు మెరుగుపరిచేందుకు, నియో జకవర్గ పర్యటనలు పారదర్శకంగా సాగేందుకు వీలుగా ప్రతి ఎమ్మెల్యేకు ఒక అధికా రిక ప్రభుత్వ వాహనాన్ని కేటాయించనున్నట్లు సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. ఆ వాహన నిర్వహణ, ఇంధన ఖర్చులు, డ్రైవర్ వేతనం నిమిత్తం నెలకు రూ. 75,000 ప్రత్యేక భత్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సంక్షేమ పథకాల ప్రకటనలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, విపక్షాలు మాత్రం ప్రభుత్వ ఆర్థిక వ్యయంపై దృష్టి సారిస్తున్నాయి. డీఎంకే ప్రభుత్వం పాల సేకరణ ధర పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి ఫైళ్లను సరైన సమయంలో బటయపెడతానని, తన బెంచ్‌పై రెండు ఫైళ్లు ఉన్నాయని, వాటిని ఇప్పుడే బయటపెట్టేలా బలవంతం చేయొద్దని చురకలంటించారు.

# ఎన్నికలకు సిద్ధంకండి..

**- గెలుపే లక్ష్యంగా పని చేయండి**

**- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ**

**- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్**

**- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా**

**అమరావతి - సూర్య వాస్తవం :**

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపుతున్న కూటమి ప్రభుత్వం

**వైసీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు బాకే హబీబుల్లా**



**అనంతపురం- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తన పాలనలో ప్రజలకు, ముఖ్యంగా బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని వైఎస్సార్సీపీ అనంతపురం జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు బాకే హబీబుల్లా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కంటితుడుపు చర్యలు తప్ప, ఎన్నికల సమయంలో "ప్రజా గళం" ఉమ్మడి మేనిఫెస్టో ద్వారా బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, వారికి తీరని అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అందరితో పాటు బీసీ నిరుద్యోగ యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి, ప్రతి సంవత్సరం విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ప్రక్రియలను పూర్తిగా పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అందరితో పాటు బీసీలకు 19 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ. 1,500 ఇస్తామన్న ఆర్థిక సాయం అమల్లోకి రాలేదు. బీసీ విద్యార్థులకు దక్కవలసిన "కలలకు రెక్కలు" పథకం, బీసీ లకు పండుగ కానుకలను నిలిపివేశారు. అలాగే, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామన్న హామీ ఇప్పటివరకు నెరవేరలేదు.?బీసీలకు ఇస్తామన్న పెండ్లి కానుక పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. బీసీ నూర్ బాషా సంక్షేమం కోసం కార్పొరేషన్‌కు రూ. 100 కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఆరోగ్య భద్రత కోసం ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ హామీలు మేనిఫెస్టో పుస్తకాలకే పరిమితమయ్యాయి అని అయన విమర్శించారు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని బాకే హబీబుల్లా పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి, ప్రజలకు ముఖ్యంగా బీసీలకు కంటి తుడుపు చర్యలు కాకుండా మేనిఫెస్టో లో ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అయోధ్యలో భూముల దందా

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించిన పలు లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ఓ జాతీయ ఆంగ్ల వార్తా సంస్థ విశ్లేషణలో ఈ విషయం బయటపడింది.

**లక్నో :** యూపీలో రామమందిర నిర్మాణంతో అయోధ్య రూపురేఖలు మారుతున్న వేళ.. భూముల ధరల పెరుగుదల కొందరికి భారీ లాభాల పంట పండిస్తున్నది. రాజకీయంగా పలుకుబడి ఉన్న కుటుంబాలు, వారి బంధువులు, అనుబంధ వ్యక్తులు ఆలయ ట్రస్టుకు భూములు విక్రయించడం ద్వారా గణనీయమైన లాభాలు పొందుతున్నారన్న ఆరోపణలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా రామమందిరానికి కేవలం మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న బాగ్ బిజైసీ గ్రామంలో జరిగిన కొన్ని భూ లావాదేవీలు ఈ పశ్నలను మరింత తీవ్రం చేస్తున్నాయి.

**ఏబీవీపీ నేతకు నాలుగు రెట్లు**

2021 డిసెంబర్‌లో మంతోశ్ మౌర్య 277 చదరపు మీటర్ల భూమిని రూ. 13.3 లక్షలకు కొనుగోలు చేశారు. నాలుగేండ్ల తర్వాత 2025 జనవరిలో దానిని రామమందిర ట్రస్టుకు రూ. 50 లక్షలకు విక్రయించారు. అంటే దాదాపు నాలుగు రెట్లు అధిక ధర. మౌర్య.. ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ సభ్యుడు. ఆయన యూపీలోని దేవరియా జిల్లా ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా ఉన్నారు.

**ఎస్పీ నేత బంధువుకూ భారీ లాభం**

2021 డిసెంబరులో శిఖా గుప్తా 833 చదరపు మీటర్ల భూమిని రూ. 40 లక్షలకు కొనుగోలు చేశారు. 2023 నవంబరులో అందులో 763.3 చదరపు మీటర్లను రామమందిర ట్రస్టుకు రూ. 1.14 కోట్లకు విక్రయించారు. శిఖా గుప్తా భర్త అమిత్ గుప్తా.. యూపీ ఎస్పీ వ్యాపార విభాగం రాష్ట్ర కార్యదర్శి నంద్‌కుమార్ గుప్తాకు మేనల్లుడు.

**ఉచితంగా వచ్చిన భూమిని.. ట్రస్టుకు భారీ ధరలకు!**

మరోలావాదేవీలో హరీశ్, కుసుమ్ పాఠక్‌లు 2021 మార్చిలో 890 చదరపు మీటర్ల భూమిని రవీంద్ర దూబేకు గిఫ్ట్ డీడ్ ద్వారా ఇచ్చారు. అంటే దూబే ఆ భూమిని కొనుగోలు చేసేందుకు డబ్బులు చెల్లించలేదు. రెండున్నరేండ్ల తర్వాత 2023 అక్టోబరులో అందులో 510 చదరపు మీటర్ల భూమిని రామ మందిర ట్రస్టుకు రూ. 54.9 లక్షలకు విక్రయించారు. ఆ భూమి మార్కెట్ విలువ రూ. 24.5 లక్షలుగా ఉండగా.. దానికి రెట్టింపు కంటే ఎక్కువ ధర ఆయనకు లభించడం గమనార్హం. కాగా రవీంద్ర దూబే బీజేపీ మాజీ మేయర్ రిషికేశ్ ఉపాధ్యాయకు బంధువు అని వార్తలు వచ్చాయి. అయితే దానిని రవీంద్ర దూబే ఖండించారు.

**నిమిషాల వ్యవధిలోనే రూ.2 కోట్ల భూమి.. రూ.18.5 కోట్లు!**

అయోధ్యలో భూ లావాదేవీలపై గతంలోనూ తీవ్ర ఆరోపణలు వచ్చాయి. 2021 మార్చిలో బాగ్ బిజైసీలో ఒక భూమిని హరీశ్ పాఠక్, కుసుమ్ పాఠక్‌లు రవీ మోహన్ తివారీ, సుల్తాన్ అన్సారీకి రూ. 2 కోట్లకు విక్రయించారు. ఆ తర్వాత కొద్ది నిమిషాల్లోనే అదే భూమిని వారు రామజన్మభూమి ట్రస్టుకు రూ. 18.5 కోట్లకు విక్రయించినట్టు గతంలో వార్తలు వెలువడ్డాయి. అంటే ఒకే భూమి లావాదేవీలోనే ధర తొమ్మిది రెట్లకు పైగా పెరగడం గమనార్హం. రవీ మోహన్ తివారీకి రిషికేశ్ ఉపాధ్యాయ కుటుంబంతో బంధుత్వం ఉన్నట్టు సమాచారం.

**రూ.9 లక్షల భూమి.. రూ.98.2లక్షలకు!**

2020 జనవరిలో విశ్వ మోహిని చౌబే.. బాగ్ బిజైసీ గ్రామంలో 621.66 చదరపు మీటర్ల భూమిని రూ. 9 లక్షలకు కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఆ ప్రాంత సర్కిల్ రేటు రూ. 29.8 లక్షలు. ఐదేండ్ల తర్వాత.. అంటే 2025 ఏప్రిల్‌లో అదే భూమిని రామ మందిర ట్రస్టుకు రూ. 98.2 లక్షలకు విక్రయించారు. అంటే కొనుగోలు ధరతో పోలిస్తే దాదాపు 11 రెట్లు ఎక్కువ అన్నమాట. విశ్వ మోహిని చౌబే భర్త ప్రదీప్ చౌబే 2023 అయోధ్య మున్సిపల్ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) తరఫున దేవ్‌కాలీ వార్డు అభ్యర్థిగా పోటీ చేశారు.

**యోగి సర్కారు ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఎక్కడ?**

ఇలాంటి భూ లావాదేవీలపై గతంలో వచ్చిన వార్తల నేపథ్యంలో యూపీలోని బీజేపీ సర్కారు ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీ భూ లావాదేవీలను పరిశీలించింది. అయితే కమిటీ నివేదిక ఇప్పటి వరకూ బహిర్గతం కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

రామమందిరం చుట్టూ భారీ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుండటంతో భూముల ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన కొందరు రాజకీయంగా ప్రభావవంత మైన వ్యక్తులు తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి, ఆలయ ట్రస్టు భూముల సేకరణ ప్రారంభించిన తర్వాత అధిక ధరలకు విక్రయిస్తున్నారా అన్నది తేలాల్సి ఉంది.

# పరిస్థితి మరింత దిగజారింది

(మొదటిపేజీ తరువాయి)

గోవా, మణిపూర్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న తరుణంలో, సీడబ్ల్యూసీ ఈ అంశాలపై చర్చించి దేశం ముందు "ప్రత్యామ్నాయం, విధానం, పరిష్కారాలను" ఉంచాలని ఖర్గే అన్నారు. "మన పోరాటం ఎప్పుడూ కేవలం రాజకీయ అధికారం కోసం మాత్రమే సాగలేదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, భారత రాజ్యాంగాన్ని నిలబెట్టడం, అలాగే భారత ప్రజల కోసం, ఈ దేశాన్ని వారసత్వంగా పొందబోయే తరాల కోసం మెరుగైన భవిష్యత్తును నిర్మించడం కోసం సాగిన పోరాటం అది" అని ఆయన సూచించారు.

ఈ ప్రభుత్వ విధానాలతో దేశ యువత నిరాశ, నిస్పృహలకు లోనతున్నారని అన్నారు. పెరుగుతున్న విద్యా ఖర్చులు, పాఠశాలల మూసివేత, ప్రశ్నపత్రాల లీకులు, నియామక పరీక్షలలో అవకతవకలు, నియామకాలలో జాప్యం వంటి వాటిని యువత ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. "ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా ఉన్న దేశాలలో భారత్ ఒకటి. అయినప్పటికీ మన యువత నాణ్యమైన విద్యను, అర్థవంతమైన ఉపాధిని పొందడానికి ఇబ్బంది పడుతోంది" అని ఖర్గే అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ విధానాలలో యువత, విద్య, నైపుణ్యాభివఅద్ధికి ప్రాధాన్యత ఇచ్చాయని చెప్పారు. రాజీవ్ గాంధీ ఓటింగ్ వయస్సును 21 నుంచి 18కి తగ్గించారని, నవోదయ విద్యాలయాల నెట్‌వర్క్‌ను విస్తరించారని, విద్యను ఉపాధి, నైపుణ్యాభివఅద్ధితో అనుసంధానించారని ఆయన అన్నారు. "మన యువతకు మెరుగైన అవకాశాలు, మరింత సురక్షితమైన భవిష్యత్తు లభించేలా విద్య నుంచి ఉపాధికి సంబంధించిన స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ముందుకు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.

**మోడీ పాలనలో దిగజారిన పరిస్థితి**

మోడీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి మరింత దిగజారిందని ఆరోపించారు. కొత్త పాఠశాలలు తెరవకపోగా, ఇటీవలి సంవత్సరాలలో సుమారు 94,000 పాఠశాలలు వమూతపడ్డాయని, ఉన్నత విద్య కూడా అంతకంతకూ ఖరీదైనదిగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్‌లు, నియామక పరీక్షలలో అవకతవకలు, నియామకాలలో జాప్యం వల్ల పేద వర్గాల విద్యార్థులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని అన్నారు. "దేశవ్యాప్తంగా యువత ఆగ్రహంతో ఉంది. ఈ ఆగ్రహం రాత్రికి రాత్రే పుట్టలేదు" అని ఖర్గే తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ప్రభుత్వం పదేపదే తాత్కాలిక చర్యలకే పాల్పడుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ 'స్టూడెంట్స్ కీ ఆవాజ్' కార్యక్రమంతో కాంగ్రెస్ ఈ సమస్యను చేపట్టిందనీ, పార్లమెంటులో కూడా విద్య, పరీక్షలకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తిందని ఆయన అన్నారు. అయోధ్య రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాల లెక్కలను ఖర్గే ప్రశ్నించారు. "రామమందిర ట్రస్ట్‌కు అందిన డబ్బు, బంగారం, ఇతర విరాళాల విషయంలో తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయి. ఈ విరాళాల లెక్కలు ఎలా చూస్తున్నారు. వాటిని ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది" అని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి పార్లమెంటులో ఈ ట్రస్ట్ ఏర్పాటును ప్రకటించారని గుర్తుచేసిన ఆయన... ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో ప్రశ్నించారు. "ఏదైనా ఆర్థిక అక్రమం జరిగితే దానిపై సరైన విచారణ జరగాలి. బాధ్యులైన వారిని జవాబుదారీగా చేయాలి" అని ఖర్గే అన్నారు. ఈ అంశం నుంచి దఅష్టి మళ్లించడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతుందని చెప్పారు. ఈ మేరకు ప్రధాని మోడీ నుంచి సమాధానాలు డిమాండ్ చేశారు. భారత సరిహద్దుల్లో ఆక్రమణలకు సంబంధించిన వార్తలను కూడా ఖర్గే ప్రస్తావించారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. "జాతీయ భద్రతను ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. అలాగని పౌరులు న్యాయమైన ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడానికి కూడా దానిని సాకుగా చూపకూడదు" అని ఆయన అన్నారు. "మన సాయుధ దళాల పట్ల మాకు అత్యంత గౌరవం ఉంది. కానీ ప్రభుత్వ వైఖరి, సరిహద్దుల్లోని పరిస్థితులపై వచ్చే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సరిహద్దుల్లో ఏం జరుగుతుందో తెలుసుకునే విషయంలో ప్రజలకు పారదర్శకత అవసరం" అని ఆయన చెప్పారు.

యువత భవిష్యత్తు, విరాళాలపై ప్రజల నమ్మకం, దేశ సరిహద్దులు అనే మూడు అంశాలు చివరికి ఒకే ప్రశ్నను లేవనెత్తుతున్నాయని ఖర్గే అన్నారు. "మన యువత తమ భవిష్యత్తు విషయంలో ఈ ప్రభుత్వాన్ని నమ్మగలరా? ప్రజాధనం, విరాళాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని పౌరులు నమ్మగలరా? అలాగే జాతీయ భద్రత గురించి నిజం చెబుతుందని దేశం నమ్మగలరా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరాం రమేశ్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కర్నాటక సీఎం డికె శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి విడి సతీశన్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు, ఆ పార్టీ సీనియర్ నేతలు పి. చిదంబరం, వీరప్ప మొయిలీ, అంబికా సోనీ, సచిన్ పైలట్, దామోదర రాజనర్సింహ, దిగ్విజరు సింగ్, ఎన్. రఘువీర రెడ్డి, పల్లంరాజుతోపాటు సీనియర్ నాయకులు హాజరయ్యారు.

# ఉద్యోగుల హక్కుల కోసం... ఉద్యమ శంఖారావం...!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ఉద్యోగులపై ఖర్చు విషయంలో స్పష్టత ఇవ్వాలి**

ఆగస్టు 4న ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రంలో ఉద్యోగులకు సంబంధించిన అంశాలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని నాయకులు విమర్శించారు. రాష్ట్ర ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతభత్యాలకే వెళ్తున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. కాగ్ నివేదికల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేసిన మొత్తం రెవెన్యూ వ్యయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లిస్తున్న వ్యయం 37.41 శాతం మాత్రమేనని తెలిపారు. రాష్ట్ర పన్నుల ఆదాయంలో ఉద్యోగులు, పెన్షనర్లపై అయ్యే వ్యయం 59.36 శాతంగా ఉందని, మొత్తం రెవెన్యూ ఆదాయంలో జీతాలు, పెన్షన్ల వ్యయం 47.64 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులపై చేస్తున్న ఖర్చును రాష్ట్ర మొత్తం ఖర్చులో ఎంత శాతంగా ఉందో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్ బకాయిలు చెల్లించాలి**

ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని నాయకులు కోరారు. ప్రభుత్వం నుంచి ఎవరికి ఎంత రావాలి, ఎప్పుడు చెల్లిస్తారో ఉద్యోగుల పే స్లిప్‌లలోనే చూపించాలని గత రెండేళ్లుగా కోరుతున్నామని తెలిపారు. రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగులు సర్వీసులో ఉండగా దాచుకున్న మొత్తాలను తిరిగి చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు సరెండర్ లీవ్ తదితర ఆర్థిక ప్రయోజనాలు కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు.

**5 డీఏలు, ఐఆర్, పీఆర్‌సీపై నిర్ణయం తీసుకోవాలి**

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదనపు పింఛను పునరుద్ధరణ, పెన్షన్ కార్పొరేషన్ ఏర్పాటు, ఎంప్లాయీస్ హెల్త్ కార్డులు, సీపీఎస్/జీపీఎస్ విధానంపై పునఃసమీక్ష, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్, హెచ్‌ఆర్ పాలసీ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**ఐదేళ్లలో భారీగా ఉద్యోగుల రిటైర్మెంట్లు**

రానున్న సంవత్సరాల్లో ఉద్యోగులు, పెన్షనర్లపై ప్రభుత్వ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఆర్.ఎన్. దివాకరరావు తెలిపారు. 2024 నుంచి 2026 వరకు 41,321 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని, రానున్న సంవత్సరాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారని పేర్కొన్నారు. దీంతో భవిష్యత్‌లో జీతభత్యాలపై ప్రభుత్వ వ్యయం మరింత తగ్గుతుందని అన్నారు.

**28న విజయవాడలో రాష్ట్ర సదస్సు**

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు కోరారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ఉద్యమం తప్ప మరో మార్గం లేదని అమరావతి జేఏసీ చైర్మన్ దివాకర్ రావు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, అదే వేదికపై ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చలపై తక్షణమే నిర్ణయాలు ప్రకటించాలని, లేకపోతే జరిగే ఉద్యమానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా, డివిజన్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, రెవెన్యూ, వీఆర్ఓ, వీఆర్ఏ, డ్రైవర్స్, వ్యవసాయ, ఖజానా, దివ్యాంగుల సంక్షేమ శాఖ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పంటకు ధర.. పొలానికి నీరు..
# రైతుకు భరోసా కావాలి...!

- రైతులకు న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన...
- రుణమాఫీ, సాగునీరు, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్...





**అనంతపురం కలెక్టర్ రేట్ - సూర్య వాస్తవం :** రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (అఖిల భారత కిసాన్ సభ) అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వెల్లడించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సాగుకు అవసరమైన నీటిని అందించాలని, పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంటల కొనుగోళ్లను సక్రమంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని కోరారు.అనంతపురం జిల్లాను కర్నూలు జిల్లాగా ప్రకటించాలన్న డిమాండ్‌ను కూడా రైతు సంఘాల నాయకులు ప్రస్తావించారు. హంద్రీ--నీవా కాలువ కింద ఇప్పటికే సాగు చేసిన పంటలకు వెంటనే నీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

# వైభవంగా వీరభద్రస్వామి ఆలయంలో 28న రాఖీ పౌర్ణమి వేడుకలు



**పామిడి - సూర్య వాస్తవం :**పామిడి మండలంలోని తమ్మళ్ళపల్లి గ్రామపొలం ప్రాంతంలో పెద్దవడుగురు గ్రామానికి అతి సమీపంలో రెండు కోట్ల రూపాయలతో పునర్నిర్మాణంతో వెలసిన మహిమానితులై ప్రఖ్యాతి చెందిన భద్రకాళివీరభద్రస్వామి (గుడ్లవీరన్న) నూతన దేవాలయంలో శ్రావణమాస వేడుకలలో భాగంగా 28 శుక్రవారంన శ్రావణపౌర్ణమి, అందులో రాఖీపౌర్ణమి కావడంతో ఆరోజు రాత్రికి తెలుగురాష్ట్రాలలో పేరెన్నిక కలిగి మహా మహులచే వందల కొలది అవార్డులు ప్రశంసా పత్రాలు పొందిన ఏలూరు భాగవ భాగవత భాగవతారిణి డాక్టర్ సప్పాభారతిచేశ హరికథ కార్యక్రమం ఘనంగా, వైభవంగా నిర్వహించబడునని, ఈ వేడుకలకు గాను కర్నూలులో ఉన్న వీరభద్రస్వామి భక్తులు, వడుగూరు భాస్కర,కర్నూలు, భక్తాదులు 15,116 రూపాయలు విరాళం అందజేయడం జరిగినది. వారికి వారి కుటుంబ సభ్యులకు వీరభద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీసభ్యులు, భక్తులు తెలియజేసారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెవిన్యూ అధికారి డిఆర్ఓ మలోల, జెఎన్టియు ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాప్రసాద్, స్వామిఆత్మానంద సరస్వతి, దత్త పీఠాధిపతి సురేంద్రమహారాజ్ తదితరులు పాల్గొను చున్నందున వీరభద్ర స్వామి యావన్మంది భక్తాదులు పాల్గొనవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వాన పత్రిక

- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుత్తి శాఖ



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్ర వర్తి శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలక ఆ హ్వాన పత్రికను ప్రబోధ సేవా స మితి ఇందూ జ్ఞాన వేదిక గుత్తి శాఖ వారి ఆధ్వర్యంలో 04.09. 26 నుండి14.09.2026 వరకు జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల క ఆహ్వానం కోసం ఈ రోజు అన గా 19.08.2026 బుధవారం గు త్తి పోలీస్ స్టేషన్ సిఐ రామారా వుకి ఎస్సై అమీర్ ఖాన్ కి ఎమ్మా ర్వో పుణ్యవతికి మున్సిపల్ క మిషనర్ జబ్బర్ మియాకి ము న్సిపల్ మాజీ చైర్ పర్సన్ వన్నూ రు బికి తెలుగుదేశం పార్టీ గుత్తి టౌన్ కన్వీనర్ ఎంకె చౌదరికి వై యస్సార్సీపి గుత్తి టౌన్ కన్వీనర్ మధుకి మరియు ఫారెస్ట్ ఆఫీస్, ఎంజీఎన్ఆర్ఇజిఎస్,ఎంపీడీఓ ఆఫీస్,హోసింగ్ ఆఫీస్,పశు సం వర్ధక్ శాఖ,ఐసీడిఎస్,బార్ అసో సియేషన్ రిజిస్టర్ ఆఫీస్,గవర్న మెంట్ ఆఫీసుల సిబ్బందికి ఆ హ్వాన పత్రికలు అందజేయడం జరిగినది.

# సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన...
# ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి...!

- కష్టపడిన కార్యకర్తలకు పదవులు దక్కుతాయనడానికి రమాదేవి ఎంపికే నిదర్శనమన్న దగ్గుపాటి...
- సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎమ్మెల్సీ రమాదేవి దంపతులు...



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం అర్బన్ సామాన్య క్లస్టర్ ఇంచార్జ్‌గా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా రమాదేవిని ప్రకటించిన అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రమాదేవి దంపతులు సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా కలిశారు.తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు రమాదేవితో పాటు ఆమె భర్త, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన పదవికి న్యాయం చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేస్తానని రమాదేవి పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు లభిస్తాయనేందుకు రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడం నిదర్శనమని అన్నారు. సామాన్య బీసీ మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం గొప్ప విషయమని, ఇది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీ రమాదేవికి కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరితో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి హర్షం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి తెలిపారు.

# పదో తరగతి నుంచి పీజీ వరకు
# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం...!

- ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో పాటు ప్రోత్సాహక నగదు అందజేత...
- తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి లక్ష్యంతో చదవాలన్న....ఎస్పీ జగదీష్...!





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ప్రతిభ కనబరిచిన 109 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో పాటు మొత్తం రూ.6.35 లక్షల ప్రోత్సాహక నగదును అందజేశారు.పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ఎస్పీ పి. జగదీష్ సూచించారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మత్తు మందుల విక్రయంపై ఉక్కుపాదం...!

- భైరవనగర్‌లో పోలీస్, డ్రగ్స్ కంట్రోల్, ఈగల్ విభాగాల సంయుక్త తనిఖీలు.
- 'అల్ట్రాస్పాస్' మందు అధిక నిల్వలు గుర్తింపు..
- ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నారన్న అనుమానంతో చర్యలు..
- అక్రమంగా మత్తు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక...!



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మత్తు మందుల అక్రమ విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీస్, ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ, ఈగల్ విభాగాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కేంద్రంలోని భైరవనగర్‌లో ఉన్న దీక్షిత్ మెడికల్ ఒ జనరల్ స్టోర్స్‌పై బుధవారం మెరుపు దాడి చేసి, అనంతరం షాపును సీజ్ చేశారు.మత్తుకు బానిసలైన వ్యక్తులకు అక్రమంగా మత్తు కలిగించే ఔషధాలను విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సాధారణంగా కడుపునొప్పి నివారణకు వినియోగించే ఆల్ట్రాస్పస్ మందును అధిక పరిమాణంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఈ మందును మత్తు కోసం యువతకు విక్రయిస్తున్నారన్న అనుమానంతో అధికారులు షాపులోని నిల్వలు, కొనుగోలు--అమ్మకాల రికార్డులు, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నిబంధనల ఉల్లంఘనలపై షాపును సీజ్ చేశారు.ఈ దాడిలో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఏడీ వీరకుమార్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కేశవరెడ్డి, మాధవి, జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, ఈగల్ నోడల్ అధికారి జైపాల్‌రెడ్డి, ఈగల్ విభాగం ఎస్ఐ హనుమంతు తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మత్తు మందుల దుర్వినియోగం కారణంగా యువత భవిష్యత్తు దెబ్బతినకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రభావం కలిగించే ఔషధాలను విక్రయించే మెడికల్ షాపులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరు మెడికల్ షాప్ యాజమాన్యం నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ మత్తు మందుల అక్రమ విక్రయాలపై పోలీస్, డ్రగ్స్ కంట్రోల్, ఈగల్ విభాగాలు సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు.





# జీతాలు, పింఛన్ల చెల్లింపుల చట్టంలో కీలక సవరణలు...!

**- చంద్రబాబు తరఫున బిల్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్...**

**- ఉద్యోగులు, పింఛనుదారుల చెల్లింపులకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరఫున రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లి'ఆంధ్రప్రదేశ్ జీతములు, పింఛను చెల్లింపు మరియు నిరర్థతల తొలగింపు చట్టము సవరణ బిల్లు--2026'లిను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో జీతాలు, పింఛన్ల చెల్లింపులకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల్లో అవసరమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ఈ సవరణ బిల్లును ప్రభుత్వం శాసనసభ ముందుకు తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి తరపున మంత్రి పయ్యావుల కేశవ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు సంబంధించిన చెల్లింపుల వ్యవస్థలో చట్టపరమైన స్పష్టత, పరిపాలనా సౌలభ్యం కల్పించే దిశగా సవరణలను ప్రతిపాదించినట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ చెల్లింపుల బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత చట్ట నిబంధనలను సమీక్షించి ఈ బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పింఛనుదారులకు సంబంధించిన బకాయిల చెల్లింపులపై దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సవరణ బిల్లుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గతంలో కూడా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపులను పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం దానిపై చర్చ జరిగే అవకాశం ఉంది. చర్చ సందర్భంగా బిల్లులో ప్రతిపాదించిన సవరణలు, వాటి వల్ల ఉద్యోగులు, పింఛను దారులపై ఉండే ప్రభావం, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు కలిగే ప్రయోజనాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. బిల్లుకు సంబంధించిన పూర్తి నిబంధనలు, సవరణల వివరాలు సభా చర్చలో ప్రభుత్వం మరింత స్పష్టంగా వెల్లడించే అవకాశం ఉంది.

# సరస్వతి విద్యా మందిరంలో 22,23న రాష్ట్ర స్థాయిపోటీలు



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో ఈనెల 22,23 శనివారం,ఆదివారం రెండు రోజులపాటు రాష్టస్థాయి ఖేల్ ఖుద్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కమిటీ అధ్యక్షులు డి.శ్రీనివాసులు పత్రికాప్రకటనలో పేర్కొన్నారు. సరస్వతి విద్యాపీఠం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 185 సరస్వతి విద్యామందిరం పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండలం, జిల్లా, జోనల్ స్థాయిలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో గెలుపొందిన అందరూ స్థానిక సరస్వతి విద్యామందిరంలో ఈనెల 22,23 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖేల్ ఖుద్ ఆటల పోటీలలో పాల్గొంటారన్నట్లు ఆయన తెలిపారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం తాడిపత్రి రోడ్డు జంగా ల కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళనకు దిగారు. మాకు నెల రోజులుగా తాగునీటి సరఫరా లేకపో వడంతో ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మహిళలు రోడ్డుపై ధర్నా చేయడంతో వాహనాల రాకపోకల కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

# బీసీలకు ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్‌పై హర్షం



**కదిరి - సూర్య వాస్తవం :** రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంస్థ గత ఎన్నికల్లో భాగంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించినందుకుగాను కదిరి తాజా మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ దిల్షాదున్నిసా ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీల పట్ల వారు అన్ని రంగాలలో అభివృద్ధిలో రాణించాలని దృఢ సంకల్పంతో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించారని చట్టసభలలో ప్రవేశం కల్పించి నందుకుగాను యావత్తు ఆంధ్రప్రదేశ్ బడుగు, బలహీన వర్గాలు ఏకధాటిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటారని హర్షం వ్యక్తం చేశారు.

# ఏసీబీకి చిక్కిన 'ఉత్తమ అధికారి...'!

**- రూ.15 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఆర్ఐ నరేంద్ర ..**

**- నాలుగు రోజుల క్రితమే 'ఉత్తమ అధికారి'గా ప్రశంసా పత్రం.**

**- మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం.. ఇంతలోనే ఏసీబీకి చిక్కిన వైనం...!**

**- ఉత్తమ అధికారి.... ఒంగోలు కార్పొరేషన్‌లో కలకలం...**





**ఒంగోలు క్రైమ్ - సూర్య వాస్తవం :** అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) నరేంద్ర లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటన అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. కొత్త ఇంటికి పన్ను విధించేందుకు రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు నరేంద్రను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నరేంద్రకు 'ఉత్తమ అధికారి'గా మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందడం గమనార్హం. ఆ ఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే లంచం ఆరోపణలతో ఏసీబీకి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. నాలుగు రోజుల క్రితం 'ఉత్తమ అధికారి'గా ప్రశంసలు అందుకున్న అధికారి.. ఇప్పుడు అవినీతి ఆరోపణలతో ఏసీబీకి చిక్కడం అధికార వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఘటనపై ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి...

**- ప్రభుత్వ ప్రకటనల్లో 30 శాతం వాటా కల్పించాలి**

**- సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా ఇవ్వాలి**

**- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక...!**



**అనంతపురం ప్రతినిధి- సూర్య వాస్తవం:** రాష్ట్రంలోని మధ్యతరహా, చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ హాజరై అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కూడా సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జారీ చేసే ప్రకటనల్లో మధ్యతరహా, చిన్న, ఇతర పత్రికలకు 30 శాతం వాటా కల్పించాలని నూతన కమిటీ సభ్యులు కోరారు. పత్రికల ఎంపానెల్‌మెంట్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, వార్తల కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. అనంతపురం జిల్లా,శ్రీ సత్యసాయి జిల్లా నూతన కమిటీలు సభ్యులు ఏకగ్రీవంగా కమిటీలనుఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షులు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుతో డీలిమిటేషన్‌కు లింక్ ఎందుకు...?

**- కేంద్ర ప్రభుత్వ విధానంపై వైసీపీ అధికాం ప్రతినిధి కె.వి. రమణ ప్రశ్నలు...**



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై వైసీపీ రాయలసీమ అధికార ప్రతినిధి కె.వి. రమణ ప్రశ్నలు సంధించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్ల మెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో, మళ్లీ ప్రత్యేకంగా ఆమోదం పొందాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ అమలుకు ప్రస్తుత పార్లమెంట్ సభ్యుల సంఖ్య ఆధారంగానే చర్యలు తీసుకోవచ్చని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయని రమణ పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్‌తో పాటు డీలిమిటేషన్ అంశాన్ని అనుసంధానం చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వ రాజకీయ వ్యూహం ఉందని ఆయన ఆరోపించారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను త్వరగా అమలు చేయకుండా డీలిమిటేషన్ అంశంతో ముడిపెట్టడం వల్ల మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రక్రియ ఆలస్యం అవుతుందని విమర్శించారు. బీజేపీ విధానాలను, కేంద్ర ప్రభుత్వ రాజకీయ వ్యూహాలను ప్రతిపక్ష పార్టీలు గుర్తించాయని, అందుకే ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రమణ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు అడగడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. అదే విధంగా ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ వంటి సంస్థల కార్యకలాపాలు, వాటి జవాబుదారీతనం, ఆర్థిక వ్యవహారాలపై కూడా ప్రజలకు స్పష్టత అవసరమని ఆయన అన్నారు. ఆయా సంస్థలపై రాజకీయ విమర్శలు చేయడంతో పాటు, వాటి చట్టపరమైన స్థితిపై కూడా బహిరంగ చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారైనా, ప్రతిపక్షంలో ఉన్నవారైనా ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని రమణ పేర్కొన్నారు. యువత, మహిళలు, నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కును గౌరవిస్తూ, ప్రభుత్వాలు తమ నిర్ణయాలకు తగిన వివరణ ఇవ్వాలని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# అర్బన్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవ...!

**- మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి విజ్ఞప్తి...**

**- ఖేలో ఇండియా పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే..**

**- సానుకూలంగా స్పందించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం**

అర్బన్ నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా విజయ వాడలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ భరణి ఐఏఎస్‌లను ఆయన కలిశారు. నియోజకవర్గంలోని యువత, క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మెరుగైన క్రీడా మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఖేలో ఇండియా' పథకం కింద అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తే స్థానిక యువత, క్రీడాకారులు నిత్యం శిక్షణ పొందడంతో పాటు వివిధ స్థాయి పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని పెంపొందిం చేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అనువైన స్థలాన్ని గుర్తించి మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఖేలో ఇండియా పథకం కింద అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై శాప్ ఛైర్మన్ రవినాయుడు సానుకూలంగా స్పందించారు. మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతు సోదరులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి

### - మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి




**ముద్దనూరు - సూర్య వాస్తవం:** మండలంలోని యామవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు ప్రతి ఒక్కరు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఫార్మర్ ఐడి పొందాలని తెలిపారు అలాగే ఖరీఫ్ లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. పంట నమోదు కాకపోతే ఏ పథకం వర్తించదు అన్నారు.రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డిఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి , సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గుచూపాలని తెలిపారు. రైతు సోదరులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా నగదు బిల్లు పొందాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనామక వ్యక్తులు వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తే తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎలినినో ప్రభావం వల్ల సాగు చేసిన పంటలు బెట్టకు గురికాకుండా తగు బెట్ట నివారణ చర్యలు పాటించాలి అన్నారు. గ్రామములో సాగు చేసిన కొర్ర పంటను పరిశీలించి నీటి ఎద్దడి కి గురికాకుండా నీటి తడులు అందించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సుధాకర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సల్మా , గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం



**పులివెందుల - సూర్య వాస్తవం :** ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాదికారి (పులివెందుల) డాక్టర్ ఖాజా మౌనద్దీన్ తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. రోనాల్డ్ రాస్ పరిశోధనకు గుర్తుగా 1897 ఆగస్టు 20న భారతదేశంలో పనిచేస్తున్న బ్రిటిష్ వైద్యుడు సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి వ్యాప్తిలో దోమల పాత్రకు సంబంధించిన కీలక ఆధారాలను గుర్తించారు. ఆడ అనాఫిలిస్ దోమలో మలేరియా పరాన్నజీవి అభివృద్ధి చెందుతున్నట్లు ఆయన పరిశోధన ద్వారా వెల్లడైంది. మలేరియా వ్యాప్తిపై ఆయన చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది అని డాక్టర్ ఖాజా మౌనద్దీన్ తెలిపారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని దోమలు వృద్ధి చెందకుండా ఉండాలి అంటే,ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిద్దయ్య సూచించారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, కూలర్లు తదితర వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శు క్రవారం 'డ్రై డే' పాటిస్తూ నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమ కాటు నుంచి రక్షణ కోసం దోమతెరలు, కిటికీలు, తలుపులకు మెష్‌లు ఉపయోగించాలని తెలిపారు. జ్వరం, చలి, తలనొప్పి, ఒళు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సలహా మేరకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజలందరూ సమష్టిగా సహకరించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పిలుపునిచ్చారు.

## ఈ నెల 25న రాయచోటికి ఏపీసీసీ స్పోర్ట్స్ ఛైర్మన్ రాక

-కాంగ్రెస్ యువ క్రీడాకారులతో, నాయకులతో ప్రత్యేక సమావేశం కానున్న ఏపీసీసీ స్పోర్ట్స్ ఛైర్మన్ జి.వి.వి.ఎస్ కమలాకరరావు
-డిసిసి అడ్మిన్, రాయచోటి నియోజకవర్గం ఇన్‌చార్జి ఆర్.అమీర్ బాష



**రాయచోటి - సూర్య వాస్తవం:** ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు,డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ సూచనల మేరకు ఈనెల 25న ఉదయం 10:00 గంటలకు రాయచోటిలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకర రావు విచ్చేయ నున్నారని డీసీసీ అడ్మిన్, కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గం ఇంచార్జి ఆర్. అమీర్ బాషా తెలిపారు. బుధవారం తమ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యటనలో భాగంగా కమలాకర రావు జిల్లా కాంగ్రెస్ నాయకులు, యువత , క్రీడాకారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని, అన్నమయ్య జిల్లా స్పోర్ట్స్ సెల్ జిల్లా ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులకు నూతన నియామకాలు చేపట్టనున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు యువజన కాంగ్రెస్ అధ్యక్షులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. స్పోర్ట్స్ కోటాలో విద్యార్థులు, ప్రతిభా వంతులైన క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తారన్నారు, రాజకీయ ప్రవేశంపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు, యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్పోర్ట్స్ సెల్ కమిటీ సభ్యత్వానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.కావున, ఈ పర్యటనను విజయవంతం చేయడానికి సంబంధిత కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరై పూర్తి సహకారం, సమన్వయం అందించ వలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ షేక్ అమీర్ బాష, జెనరల్ సెక్రటరీ సయ్యద్ సమీరుద్దీన్, పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, ఖాదర్ ఖాన్, మస్తాన్, స్వనజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరువు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

### - వ్యవసాయం, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్- ఎల్‌నినో ప్రభావంపై ప్రైమరీ సెక్టార్ అధికారులతో సమీక్ష





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, ఉద్యాన పంటలు, సూక్ష్మ నీటిపారుదల, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ, సహకార శాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర ప్రాథమిక రంగాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం కలెక్టరేట్లోని కోర్టు హాలులో సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, లోటు వర్షపాతం ప్రభావం, ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా, ఉద్యాన పంటల సాగు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**వ్యవసాయ రంగంపై సమీక్ష**

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 4,60,455 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు సుమారు 50,597 హెక్టార్లలో మాత్రమే విత్తనాలు వేశారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత పది రోజులుగా వర్షపాతం లేకపోవడంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటికే కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు పంటల పరిస్థితిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. పంటల బీమాకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 1,781 మంది రైతులు, ఇతర బీమా పథకాల కింద 19,021 మంది రైతులు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బీమా నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో ఉద్యాన పంటల సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1.35 లక్షల ఎకరాలు కాగా, ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో సాగు నమోదైనట్లు అధికారులు తెలిపారు. సుమారు 33 వేల ఎకరాల మేర లోటు ఉన్నట్లు వివరించారు. ముఖ్యంగా టమాటా, ఇతర కూరగాయలు, పూల పంటల సాగు విస్తీర్ణంలో తగ్గుదల ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగుపై ప్రభావాన్ని నిరంతరం అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**ఈ-క్రాప్ నమోదు త్వరగా పూర్తి చేయాలి**

రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో ఈ-క్రాప్ నమోదు కీలకమని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలో ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పంటల వాస్తవ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా డేటాను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

**తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు**

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాలు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామాలు, బోర్ల పరిస్థితి, బోర్ల లోతు పెంచడం, మోటార్లను లోతుకు దించడం, నీటి వనరుల రీఛార్జ్ వంటి అంశాలపై సమీక్షించారు. ఎక్కడైనా బోరు లేదా పంప్‌సెట్‌లు మరమ్మతులకు గురైతే వాటిని తక్షణమే మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి రవాణా, ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగం వంటి చర్యలను ముందుగానే చేపట్టి నీటి సంక్షోభం ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన శాఖలను కూడా సమీక్షించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు.

అధికారులు శాఖల వారీగా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్యం, నివారణాత్మక వైద్య సంరక్షణకు అమర రాజా ప్రాధాన్యత

### - అమర రాజా సంస్థ వార్షిక వైద్య పరీక్షలు ఘనంగా ప్రారంభం




**తిరుపతి- సూర్య వాస్తవం:** ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం మరియు నివారణాత్మక వైద్య సంరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ అమర రాజా సంస్థ వార్షిక వైద్య పరీక్షల కార్యక్రమాన్ని బుధవారం, ఆగస్టు 19న అమర హాస్పిటల్ భాగస్వామ్యంతో ఘనంగా ప్రారంభించింది. ఈ ఏడాది వార్షిక వైద్య పరీక్షల్లో భాగంగా తొలిసారిగా 45 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఉద్యోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఉద్యోగుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సహాయాన్ని సకాలంలో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమ ప్రారంభోత్సవంలో డా. ప్రసాద్ గౌరినేని, ఛైర్మన్, అమర హాస్పిటల్; డా. రామాదేవి గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్, అమర హాస్పిటల్; శ్రీమతి భాగ్యలక్ష్మి, సీవోవో, అమర హాస్పిటల్ ప్రశాంత్ తివారీ, సీఎస్ఓ, అమర రాజా డా. చంద్రబాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్, అమర రాజా; నళిని కుమార్, హెడ్ -- షేర్డ్ సర్వీసెస్, అమర రాజా; శ్రీరామ్ ఎస్వీ, సీఈఓ -- మంగళ్ ఇండస్ట్రీస్; శ్రీరామ్ వై., బిజినెస్ హెడ్ -- గల్లా ఫుడ్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ప్రసాద్ గౌరినేని, డా. రామాదేవి గౌరినేని ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉండటం వ్యక్తిగత సంక్షేమానికే కాకుండా, సురక్షితమైన, ఉత్పాదకమైన ,సుస్థిరమైన సంస్థ నిర్మాణానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు.వార్షిక వైద్య పరీక్షలు -- 2026లో మరో ముఖ్యమైన అంశంగా వైటాలిటీ ఇండెక్స్ ను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఉద్యోగులు తమ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడంతో పాటు, గతంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఫలితాలతో ప్రస్తుత ఫలితాలను పోల్చుకుని తమ ఆరోగ్య పురోగతిని తెలుసుకునే అవకాశం కలుగుతుంది. వార్షిక వైద్య పరీక్షలు -- 2026లో దేశవ్యాప్తంగా సుమారు 24,020 మంది ఉద్యోగులు వైద్య పరీక్షలకు అర్హులు కాగా, ఈ కార్యక్రమం సంస్థకు చెందిన ఐదు తయారీ కేంద్రాల్లో నిర్వహించబడుతోంది. అమర హాస్పిటల్, అమర రాజా సంస్థల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నివారణాత్మక వైద్య సంరక్షణ, ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ఆరోగ్యవంతమైన ఉద్యోగ బృందాన్ని నిర్మించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సాధారణ వార్షిక వైద్య పరీక్షలకు మించి, ఉద్యోగుల్లో నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు అమర రాజా చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో వార్షిక వైద్య పరీక్షలు -- 2026 మరో ముఖ్యమైన ముందడుగు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 'వైటాలిటీ ఇండెక్స్' వంటి కొత్త కార్యక్రమాల ప్రవేశంతో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం అందించే సంస్థ విధానం మరింత బలోపేతమైంది. ఉద్యోగుల ఆరోగ్యం కేవలం వైద్యపరమైన ప్రాధాన్యత మాత్రమే కాదు సంస్థకు అత్యంత కీలకమైన ప్రాధాన్యత అనే అమర రాజా నిబద్ధతను వార్షిక వైద్య పరీక్షలు -- 2026 కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# జానీ మాస్టర్‌కు ఫిలిం ఫెడరేషన్ షాక్.. షేధం కొనసాగింపు!



**జానీ మాస్టర్‌పై నిషేధం కొనసాగిస్తున్నట్టు తెలిపిన ఫిలిం ఫెడరేషన్**
**ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలే కారణమని స్పష్టీకరణ**
**డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు సహకారం నిలిపివేస్తున్నట్టు ప్రకటన**
**పెద్దల మాట వినకుండా ఉప ఎన్నిక నిర్వహించడంపై తీవ్ర ఆగ్రహం**
**జానీ మాస్టర్ ఇచ్చిన రూ. 3 లక్షలు వెనక్కి పంపుతున్నట్టు వెల్లడి**

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు తెలుగు చలనచిత్ర కార్మిక సమాఖ్య (ఫిల్మ ఫెడరేషన్) గట్టి షాక్ ఇచ్చింది. ఆయనపై గతంలో విధించిన నిషేధాన్ని కొనసాగిస్తున్నట్లు సమాఖ్య స్పష్టం చేసింది. బుధవారం జరిగిన ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించినందుకే జానీ మాస్టర్‌పై ఈ చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో డ్యాన్సర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుమలత తీరుపై కూడా ఫెడరేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సినీ పెద్దలు, నిర్మాతల మండలి సూచనలను కాదని, ఏకపక్షంగా డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు ఉప ఎన్నికలు నిర్వహించడాన్ని ఫెడరేషన్ తీవ్రంగా తప్పుపట్టింది.ాల నేపథ్యంలో, ఇకపై డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు ఎలాంటి సహకారం అందించబోమని ఫెడరేషన్ స్పష్టం చేసింది. అయితే, సామాన్య డ్యాన్సర్లకు వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. మిగతా 23 క్రాఫ్టులకు మాత్రం యథావిధిగా సహకారం కొనసాగుతుందని పేర్కొంది. అంతేకాకుండా, గతంలో జానీ మాస్టర్ ఫెడరేషన్‌కు ఇచ్చిన రూ. 3 లక్షల మొత్తాన్ని కూడా ఆయనకే తిరిగి పంపిస్తున్నట్లు వెల్లడించింది.



# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది: వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు.త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.

# బెట్టింగ్ యాప్స్ కేసు: ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్



ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.



# గాలే టెస్టులో భారత్ ఘన విజయం.. సుతార్ స్పిన్ మాయకు లంక చిత్తు!




శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (6/55) అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఖాతాలో 12 కీలక పాయింట్లను జమ చేసుకుంది. భారత జట్టుకు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం, గాలే స్టేడియానికి 50వ టెస్టు కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది.నేడు ఐదో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక 77.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. లంచ్ విరామం తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనాల్ దినుష, కేశర నువంత కొద్దిసేపు భారత బౌలర్లను నిలువరించారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన దినుష (84) మరోసారి అద్భుతంగా ఆడి, రెండో సెంచరీ దిశగా సాగుతున్నట్లు కనిపించాడు. ఈ దశలో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందేమోననిపించింది.

అయితే, యువ కెరటం మానవ్ సుతార్ తన స్పిన్ మాయా జాలంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 76వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన సుతార్, ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించాడు. ఆ ఓవర్లో దినుషను లెగ్ గల్లీలో ధ్రువ్ జురెల్ క్యాచ్ ద్వారా ఔట్ చేసి కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని లహిరు కుమార ఎదుర్కొన్నప్పటికీ, రెండు బంతుల తర్వాత అతనిని కూడా కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తన రెండో టెస్టులోనే రెండోసారి ఐదు వికెట్ల ఘనతను సుతార్ అందుకున్నాడు.ఆ తర్వాత కొద్దిసేపు నువంత (20) పోరాడినా.. 78వ ఓవర్లో అతడిని కూడా బౌల్డ్ చేసిన సుతార్, భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మ్యాచ్‌లో సుతార్ మొత్తం 101 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు.భారత్ విజయానికి తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సాధించిన అద్భుతమైన సెంచరీ (167) బలమైన పునాది వేసింది. అతని ఇన్నింగ్స్ వల్లే భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ (66) కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ స్కోరుతో భారత్ బౌలర్లు టర్నింగ్ పిచ్‌పై లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని ఖాయం చేశారు.

సంక్షిప్త స్కోర్లు:
భారత్: తొలి ఇన్నింగ్స్ - 462, రెండో ఇన్నింగ్స్ - 193
శ్రీలంక: తొలి ఇన్నింగ్స్ - 284, రెండో ఇన్నింగ్స్ - 206

# కోహ్లీ జెర్సీ నంబర్.18 వెనుక ఇంత పెద్ద కథ ఉందా?




క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ అనే పేరు ఒక బ్రాండ్. అతని ఆటతీరు ఎంతగా అభిమానులను ఆకట్టుకుంటుందో, అతని జెర్సీ నంబర్ 18 కూడా అంతే సుపరిచితం. అయితే, ఆ నంబర్ వెనుక ఒక యాదృచ్ఛిక కేటాయింపు, ఒక విషాదకర ఘటన, ఒక చారిత్రాత్మక ఆరంభం దాగి ఉన్నాయి. అది కేవలం ఒక అంకె కాదు, కోహ్లీ జీవితంలోని భావోద్వేగ ప్రయాణానికి ప్రతీక.కోహ్లీకి ఈ నంబర్‌ను తొలుత భారత అండర్-19 జట్టులో ఉన్నప్పుడు యాదృచ్ఛికంగా కేటాయించారు. అప్పుడు దానికి ప్రత్యేకత ఏమీ లేదు. కానీ, కాలక్రమంలో జరిగిన రెండు ప్రధాన సంఘటనలు ఆ నంబర్‌ను అతని జీవితంలో విడదీయరాని బంధంగా మార్చేశాయి.2006 డిసెంబర్ 18... అప్పుడు కోహ్లీ వయసు 18 ఏళ్లు. ఢిల్లీ తరఫున కర్ణాటకతో రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడుతున్నాడు. ఆ రోజు రాత్రి అతని తండ్రి ప్రేమ్ కోహ్లీ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారన్న వార్త తెలిసింది. పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ, జట్టు కష్టాల్లో ఉన్నందున మరుసటి రోజు బ్యాటింగ్ కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును ఆదుకున్న తర్వాతే తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. తండ్రిని కోల్పోయిన ఆ 18వ తేదీ, అతని జీవితంలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది.కట్ చేస్తే.. సరిగ్గా రెండు సంవత్సరాల లోపే అదే 18వ నంబర్ అతని జీవితంలోకి కొత్త వెలుగును తీసుకొచ్చింది. 2008 ఆగస్టు 18న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ భారత సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేశాడు. అతను ధరించిన జెర్సీ నంబర్ కూడా 18. తన జీవితంలో అత్యంత విషాదకరమైన రోజు, అత్యంత ముఖ్యమైన కెరీర్ ఆరంభం రోజు రెండూ 18వ తేదీనే రావడం ఒక 'కాస్మిక్' కనెక్షన్ అని కోహ్లీ స్వయంగా అభివర్ణించాడు.అప్పటి నుంచి తన తండ్రికి నివాళిగా, తన అరంగేట్రానికి గుర్తుగా కోహ్లీ ఎప్పుడూ ఆ నంబర్‌ను మార్చుకోలేదు. భారత జట్టు తరఫున అన్ని ఫార్మాట్లలో, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున అదే నంబర్‌తో బరిలోకి దిగుతున్నాడు. ఇప్పుడు 18వ నంబర్ జెర్సీ అంటే విరాట్ కోహ్లీ, విరాట్ కోహ్లీ అంటే 18వ నంబర్ జెర్సీ అనేంతగా అది అతని కెరీర్‌లో భాగమైపోయింది.

## ఓటర్ల అభ్యంతరాలపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, వినతులపై బుధవారం నిర్వహిస్తున్న పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామంలో జరుగుతున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపడుతున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల నుంచి అందిన అభ్యంతరాలు,వినతులను నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి,అర్హత ఆధారంగా నిష్పక్షపాతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వి.దేవేంద్ర రెడ్డి, ఓజిలి తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## 34 శాతం బీసీ రిజర్వేషన్లపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బీసీ నేత జువ్వలపాటి మస్తాన్



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం జరుగు తున్న అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు కు సూళ్లూరుపేట నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ మొదటినుండి వెనకబడిన వర్గాలకు అండగా ఉందని జువ్వలపాటి మస్తాన్ తెలియజేశారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి బీసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి కూటమి పాలనలో తెలుగుదేశం పార్టీ వెనకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందించాలని తెలియజేశారు. వెనకబడిన వర్గాల ప్రజలంతా తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ నేత జువ్వలపాటి మస్తాన్ కోరారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** కర్నూలు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ఎస్ఎస్ పి .ఓ .డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ,భారతదేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం,ఆయన ధైర్యసాహసాలు,దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆజాద్ హింద్ ఫౌజ్ను స్థాపించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నేతాజీ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. నేతాజీ ఆశయాలను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశం పట్ల ప్రేమ, క్రమశిక్షణ, ధైర్యం, సేవాభావం వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు అర్పించారు.



## అధ్యక్షా...ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ జరగాలి

### - ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** అధ్యక్షా...నిరుపేద రోగులు వారి శరీరంలో మార్పుకు గురైన ఆర్గాన్స్ ట్రాన్స్ ప్లాంటేషన్ మార్పిడి సౌకర్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వివరించారు. బుధవారం ఆయన రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించిన ప్రత్యేక శాసనసభ కార్యక్రమంలో ఆరోగ్య విషయాలపై సభాధ్యక్షుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ అధ్యక్షా...రాష్ట్రంలో రోగులకు అవసరమైన ట్రాన్స్ ప్లాంటేషన్ 90 శాతం ప్రైవేటు వైద్యశాలల్లోనే జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ విధానం నిరుపేదల వైద్య సేవల నిమిత్తం నేడు రాష్ట్రంలో ఉన్న ట్రాన్స్ ప్లాంటేషన్ హాస్పిటల్స్ 3 మూడు మాత్రమే ఉండగా,వాటిని 9కి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అయితే గుండె సంబంధ మార్పిడి శస్త్ర చికిత్సలు మాత్రం పద్మావతి హాస్పిటల్ లో ఎక్కువ సంఖ్యలో జరిగాయని అన్నారు. ట్రాన్స్ ప్లాంటేషన్ సౌకర్యం మెడికల్ కళాశాలలో కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ప్రైవేటు హాస్పటల్ లలో అధికంగా లివర్,కిడ్నీ జరుగుతున్నాయని తెలియ జేశారు. అవయవాల మార్పిడితో ప్రాణాపాయం నుండి కాపాడడానికి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఉత్తమమైన మార్గమని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను మార్పిడి చేసుకునేందుకు కొందరు సామాజికపరంగా, కొన్ని అపోహలు పెట్టుకొని నిరాకరిస్తున్న వారిని మోటివేషన్ చేసేందుకు పలు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని సూచించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుండి 8 అవయవాలు,50 టిష్యూలను సేకరించినట్లు తెలిపారు. ట్రాన్స్ ప్లాంటేషన్ చేయడానికి చట్టపరంగా కొన్ని చట్టాలను కూడా సవరించడం జరుగుతుంద న్నారు. బ్రెయిన్ డెడ్ పై అవగాహన కలిగించే విధంగా పలు చర్యలు కూడా చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. బ్రెయిన్ డెడ్ ద్వారా అవయవ దానాలు చేసిన కుటుంబాలకు లక్ష రూపాయలు అందే విధంగా ప్రభుత్వానికి సిపారిస్తూ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పేద వాడికి ప్రభుత్వపరంగా అవసరమైన ఆరోగ్య సేవలు అందిం చేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలను గురించి వివరించారు. అధ్యక్షా పేద బడుగు బలహీన వర్గానికి ఆర్థికపరమైన భారం లేకుండా ఆరోగ్య సేవలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలో అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతుందని వివరించారు.

## ప్రజల పలుకే ప్రాధాన్యం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - అక్కగారిపేటలో వైఎస్సార్‌సీపీ గుడ్ మార్నింగ్ కార్యక్రమం
### - ప్రజల గడపకు చేరిన పార్టీ నాయకులు.. సంక్షేమ పాలనపై విస్తృత ప్రచారం

**పెళ్లకూరు – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని అక్కగారిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ మార్నింగ్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. గ్రామంలోని పలు వీధుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**జగన్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట.. ప్రజల జీవితాల్లో మార్పు: కామిరెడ్డి**

ఈ సందర్భంగా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయడంతో పాటు, పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుని వారి సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా అప్పటి ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు, కార్యకర్తలు గ్రామస్థుల వద్ద నేరుగా తెలుసుకోవడం ద్వారా ప్రజలకు పార్టీ మరింత చేరువ అవుతుందని తెలిపారు. రాజకీయాల్లో మాటల కంటే ప్రజల కోసం చేసిన పనులే ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రజల సంక్షేమమే రాజకీయాలకు ప్రాతిపదిక కావాలి: నన్నం ప్రిస్కిల్లా**



జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకోవడం, అవసరమైన సమయంలో వారికి అండగా నిలవడం ప్రజా ప్రతినిధుల ప్రధాన బాధ్యత అన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడినప్పుడే గ్రామాల్లో ఉన్న వాస్తవ సమస్యలు పూర్తిగా అర్థమవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావడం, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, బలహీన వర్గాలకు అవసరమైన సహకారం లభించడం వంటి అంశాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకునే పాలన మాత్రమే చిరస్థాయిగా నిలుస్తుందని ఆమె అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు వాటిని గుర్తుచేసుకుంటున్నాయని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు.

**ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండా**

కార్యక్రమంలో నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలు, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని అన్నారు. ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని వాటిపై నిరంతరం పోరాడేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలకు దిశానిర్దేశం**

రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కుటుంబంతో సత్సం బంధాలు కొనసాగించాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని నిర్మించడమే లక్ష్యంగా గుడ్ మార్నింగ్ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు శైలజ, బీసీ సెల్ అధ్యక్షుడు దయాకృష్ణ యాదవ్, యువత అధ్యక్షుడు సాగి జితేంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లం సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ప్రజల గడపకు చేరువగా.. ప్రజల సమస్యలకు అండగా.. సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతుంది"అని నాయకులు పేర్కొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

### - ఫోటోగ్రాఫర్ల ఐక్యతను చాటుతూ భారీ ర్యాలీ
### - గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు

**నాయుడుపేట– సూర్య వాస్తవం :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పట్టణంలో స్వర్ణముఖి ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన ర్యాలీ చేపట్టారు.

**గాంధీ పార్క్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ**

గాంధీ పార్క్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ పార్క్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫోటోగ్రఫీ కళ ప్రాముఖ్యత, దాని చరిత్ర, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోటుచేసుకుంటున్న మార్పులను ప్రజలకు తెలియజేస్తూ ర్యాలీ కొనసాగింది. ఫోటోగ్రాఫర్ల



ఐక్యతను చాటుతూ చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. ర్యాలీ అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**జ్ఞాపకాలను భద్రపరిచే అద్భుత కళ ఫోటోగ్రఫీ**

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం చిత్రాలను చిత్రీకరించే కళ మాత్రమే కాదని, వ్యక్తుల జీవితాల్లోని మధురమైన జ్ఞాపకాలను, సమాజంలో చోటుచేసుకునే ముఖ్యమైన సంఘటనలను భవిష్యత్ తరాలకు భద్రపరిచే శక్తివంతమైన మాధ్యమమని అన్నారు. కాలంతో పాటు ఫోటోగ్రఫీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని, అందుకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతు న్నారని తెలిపారు. ఫోటోగ్రఫీ రంగానికి సేవలందించిన ప్రముఖులను స్మరించు కోవడంతో పాటు, ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమం కోసం సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి, వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణముఖి ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జి.ఆర్. బాబు, అధ్యక్షులు కె. ధర్మయ్య, ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. రవికుమార్, కార్యదర్శి కె.వి. కిషోర్, కోశాధికారి ఎన్. ప్రభాకర్‌తో పాటు సభ్యులు కె. సునీల్, రవీంద్రబాబు, భాషా, ఖలీల్ భాషా, కన్నడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )